క్లుప్తంగా

ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రగతి సాధించండి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుహాసిని

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణలో ప్రగతి చూపాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు, లక్ష్యాల మేరకు ప్రగతి తదితర అంశాలపై చర్చించారు. ఎన్‌సీడీ–సీడీ, మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం, ఇతర ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి, లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, ఎన్‌సీడీ–సీడీ కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, టిబి వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, డీపీఓ వి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకలి, దాహం తీర్చాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): మండు వేసవిలో పాదచారులకు ఆకలి, దాహం తీర్చడం పుణ్యప్రదమని, అభినందనీయమని ఆధ్యాత్మికవేత్త, వాసవి క్లబ్స్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరతయ్య గుప్తా అన్నారు. వాసవి క్లబ్ సూపర్‌స్టార్ విద్యాధరపురం ఆధ్వర్యాన స్థానిక కుమ్మరిపాలెం సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పెరుగు ఆవడ, మజ్జిగ, మినరల్ వాటర్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి స్వచ్ఛంద సంస్థ, దాతలు ఇటువంటి సేవా కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. క్షుద్బాధ, దాహార్తి తీర్చుకున్న వారి హృదయం నుంచి వచ్చే ఆశీస్సులు దాతలకు శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లలితారాణి, అనురాధ, కోశాధికారి లలిత, అంజన, మల్లిక, తులసి, సుందరరావు, విజయలక్ష్మి, ప్రీతి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తల్లి అదృశ్యమైన ఘటనపై కుమారుడి ఫిర్యాదుతో కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వైఎస్సార్ కాలనీకి చెందిన అప్పదొర కాశమ్మ, వెంకటేశ్వర్లు దంపతులు. వీరికి ముగ్గురు సంతానం. మొదటి, రెండో కుమారుడికి వివాహాలయ్యాయి. కాశమ్మకు అప్పుడప్పుడు మతిస్థిమితం సరిగా లేదు. మూడో కుమారుడు చిన్నదొరతో ఆమె నివసిస్తోంది. గత నెల 25న కాశమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెదికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అన్నిదానాల్లో అన్నదానం మిన్న



మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్నిదానాల్లో అన్నదానం మిన్న అని ఆకలితో ఉన్నవారి కడుపు నింపడంలో ఉన్న తృప్తి మరెందులోను ఉండదని ముళ్లపూడి కృష్ణమోహనరావు అన్నారు. ముత్యాలంపాడులో సోమవారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అన్నదానం జరిగింది. సుమారు 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక, రహీమా, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపాలి

నందిగామటౌన్: బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు పనులకు కాకుండా విధిగా బడికి పంపాలని జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు అన్నారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కరరావు, ప్రకాశరావు, ఆజాద్, మల్లేశ్వరరావు, కుసుమకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు కరుణ, మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో శారీరక ఆరోగ్యం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రోజూ సైకిల్ వినియోగించడం ద్వారా శారీరక ఆరోగ్యం కలుగుతుందని గుంటుపల్లి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ పీవీఎస్ఆర్ కృష్ణ అన్నారు. కేంద్ర విద్యా విధానం 2020పై నిర్వహిస్తున్న స్థానిక కేంద్రీయ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన్భాగిదారీ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

విద్యాకానుక కిట్ల పంపిణీలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వన్‌టౌన్‌లో జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలోని స్థానిక 37వ డివిజన్ గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం నాలుగో విడత జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ జరిగింది. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేశారు. తొలుత పుస్తకాలు, యూనిఫామ్ క్లాత్, బ్యాగ్ తదితర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. నియోజకవర్గంలోని 66 పాఠశాలల్లో చదువుకునే 11,242 మంది విద్యార్థులకు 2, 92,29, 200 విలువైన కిట్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ అందరికీ నాణ్యమైన పుస్తకాలు బట్టలు, బూట్లు ఇస్తున్నామన్నారు. కార్పొరేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. విదేశీ విద్య పేరుతో విద్యార్థులను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని దుయ్యబట్టారు. ఎన్నడూ లేనివిధంగా స్కూల్ తెరిచిన రోజే కానుక ఇస్తారన్నారు. పిల్లలు బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ, సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న విద్యా కానుక కిట్లను అందుకున్న విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో సుమారు 462 మంది విద్యార్థులకు 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, హైస్కూల్ హెచ్ఎం వీవీ రవికుమార్, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ రజని, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రత్నబాబు, రంగారావు, బీవీ రమణ పాల్గొన్నారు.

ఎస్ఎంఏ ఖుద్దూస్ ఉర్దూ హైస్కూల్‌లో..

భవానీపురం 40వ డివిజన్‌లోని ఎస్ఎంఏ ఖుద్దూస్ ఉర్దూ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, కనమర్లపూడి సుబ్బారావు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో స్థానిక కార్పొరేటర్, వీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు యర్రగ ఆంజనేయరెడ్డి జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉమర్ అలీ, కేవీవీ ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్‌కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, పైడూరుపాడు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలల్లో సోమవారం 'జగనన్న విద్యా కానుక' కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక ఎంపీటీసీ బయ్యారపు కల్పన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బయ్యారపు కిషోర్ విద్యార్థులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పైడూరుపాడు సర్పంచ్ సీతారామయ్య, జక్కంపూడి హైస్కూల్ హెచ్ఎం కె.పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యాధరపురం జీఎస్సార్ హైస్కూల్‌లో..



భవానీపురంలోని ఎస్ఎంఏ ఖుద్దూస్ ఉర్దూ హైస్కూల్లో ..

ఆటల్లో రాణించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఆటల్లో కూడా రాణించాలని కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పిలుపునిచ్చారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం స్విమ్మింగ్‌లో సత్తాచాటుతున్న కళాశాల విద్యార్థి బోను బాలగంగాధర్ అభినందన కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా ఆయన్ను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అంతర్‌జిల్లాల ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో 200 మీటర్స్ వ్యక్తిగత మిడ్లే విభాగంలో బంగారు, 100,200 మీటర్స్ బ్యాక్‌స్ట్రోక్ విభాగం, 100 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో ఒక బంగారు, మూడు రజత పతకాలు సాధించడం కళాశాలకే గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో 79వ జాతీయ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటి కళాశాలకు రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ మండవ కోటేశ్వరరావు, డాక్టర్ డీ యుగంధర్, డాక్టర్ అనిల్ కుమార్ బోను బాలగంగాధర్‌ను అభినందించారు.



గంగాధర్‌ను సత్కరిస్తున్న కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్

గడువులో స్పందన అర్జీలు పరిష్కరించండి

మేయర్ భాగ్యలక్ష్మి



స్పందనలో మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్పందనలో వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులో పరిష్కరించాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వారు అధికారులతో కలిసి సోమవారం నిర్వహించిన స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అర్జీదారుని సమస్యను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం, వీఎంసీ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, పథకాలు సకాలంలో అందుతున్నాయా లేదా అనేది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

స్పందనలో వచ్చిన అర్జీలు 11

స్పందనలో వివిధ సమస్యలపై మొత్తం 11 అర్జీలు రాగా వాటిల్లో ప్రధానంగా తాగునీటి సరఫరా, డ్రెయినేజి కాలువల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం – 2, పట్టణ ప్రణాళిక విభాగం – 4, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) – 3, పబ్లిక్ హెల్త్ విభాగం – 1, రెవెన్యూ –1 ఉన్నాయని వివరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) శకుంతల, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కేబీఎస్ఎస్ లత, ఏడీహెచ్ శ్రీనివాసు, బయాలజిస్ట్ సూర్య నాయక్, మేనేజర్ బీ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాల స్పందనలో 2 అర్జీలు

నగరంలోని మూడు నియోజకవర్గాల్లోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించిన స్పందనలో ఆయా ప్రాంతాల ప్రజల నుంచి మొత్తం 2 అర్జీలు స్వీకరించారు. సర్కిల్–2 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం – 1, రెవెన్యూ – 1 అర్జీలు రాగా సర్కిల్ – 1, 3 నుంచి ఎటువంటి అర్జీలు రాలేదని ఆయా కార్యాలయాల జోనల్ కమిషనర్లు తెలిపారు.

రాష్ట్రానికే తలమానికంగా అంబేడ్కర్ విగ్రహం

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంబేడ్కర్ స్మృతివనం ప్రాజెక్ట్ పనులను ఒక మహాయజ్ఞంలా చేస్తున్నారని, 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం నిర్మాణం పూర్తి చేసుకుని రాష్ట్రానికే తలమానికంగా నిలవనుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరి వై.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో ఎంజీ రోడ్డులోని స్వరాజ్యమైదానంలో జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 18.18 ఎకరాల్లో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని, ఇప్పటికే 74 అడుగుల ఎత్తు (ఉదర భాగం) వరకు విగ్రహ నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. స్మృతివనం పనుల కోసం వందలాది మంది కార్మికులు భారీ యంత్రాలతో పనులను కొనసాగిస్తున్నారని చెప్పారు.

సీఎం జగన్ దిశానిర్దేశంతో పనులు వేగవంతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అంబేడ్కర్ స్మృతివనం ప్రాజెక్ట్‌పై దృష్టి సారించి పనులను సమీక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారని కమిషనర్ అన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన స్మృతివనం నిర్మాణం డిజైన్ల ఆధారంగా పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనుల్లో వేగం పెంచారని తెలిపారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా చేస్తున్నారని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు నాణ్యతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. గ్రానైట్, ఫుట్‌పాత్, ల్యాండ్‌స్కేప్, కాంపౌండ్‌వాల్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయని, పార్కింగ్ ఏరియాకూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంగణంలో అందమైన రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేయనున్నారని తెలిపారు.

శ్రీనివాసుని సేవలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



హరీష్‌కుమార్ గుప్తాకు స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ కమిటీ కార్యవర్గం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని పద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామిని హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా సోమవారం దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ కమిటీ సెక్రటరీ మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు సాదరంగా స్వాగతం పలకగా, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ కమిటీ తరపున హరీష్‌కుమార్ గుప్తాకు ఆలయ కమిటీ పట్టువస్త్రాలు, స్వామి వారి ప్రసాదాలను అందచేశారు. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ఆలయ సిబ్బందికి హరీష్‌కుమార్ గుప్తా ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం మహాలక్ష్మీ దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్(రాజా), శీరం వెంకట్రావు, కమిటీ సభ్యులు కామందుల నరసింహారావు, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూలిన భారీ వృక్షం, విద్యుత్ స్తంభాలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ శివారు రామచంద్రపాలెం రోడ్డు వద్ద సోమవారం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై భారీ వృక్షంతో పాటు, విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపోయి కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నున్న గ్రామస్తులు అవస్థలు పడ్డారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. బైపాస్ రోడ్డు నుంచి వాహనాలు రాకపోకలు సాగించాయి. ఎలక్ట్రికల్ ఏడీఈ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో 40 మంది విద్యుత్ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సంయుక్తంగా పనిచేసి రోడ్డును క్లియర్ చేశారు. రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరా పునఃప్రారంభమైంది.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పారిశుద్ధ్య సిబ్బంది ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని 10, 11 వార్డుల్లో పటమట కూడలి, పంటకాలువ రోడ్, కరణంగారి బజార్, కాకతీయ రోడ్, ఫన్‌టైమ్ రోడ్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి చెత్త వాహనాలు ఎన్ని గంటలకు వస్తున్నాయి, వీధులను తరచూ శుభ్రం చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. తరచూ కాలువల్లో పూడిక తీతలు, బ్లీచింగ్ చల్లించటం, ఫాగింగ్ తదితర పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని, వానా కాలం దృష్ట్యా పూడికలు తీయాలని అధికారులను ఆదేశించారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో పలువురు అధికారులు, సిబ్బందికి అంతర్గత బదిలీలు జరిగాయి. వారు తక్షణమే విధుల్లో చేరాలని దుర్గగుడి ఈఓ భ్రమరాంబ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా అధికారులు బదిలీ అయిన విభాగాల్లో విధులు స్వీకరించారు. దుర్గగుడి డీఈవో గురుప్రసాద్‌కు ప్రసాదాల తయారీ, ప్రసాదాల స్టోర్స్, వేద పాఠశాల, లీజు, దేవస్థాన భూముల విభాగం నుంచి కొన్ని విభాగాలు తొలగించి కేశఖండనశాల, వేద పాఠశాల, లీజు, దేవస్థాన భూములు, లీగల్ విభాగాలు కేటాయించారు. ఏఈవో చంద్రశేఖర్‌కు పరిపాలనా విభాగం, అకౌంట్స్, స్టేషనరీ విభాగం నుంచి ప్రధాన దేవస్థాన పర్యవేక్షణ, ప్రసాదాల తయారీ, ప్రసాదాల స్టోర్స్, ఫెస్టివల్, పూజలు, ట్రస్ట్ బోర్డు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్ బి. నాగరాజుకు మెడికల్ లీవ్ అనంతరం వేద పాఠశాల విధులు అప్పగించారు. లీజులు, దేవస్థాన భూములు, లీగల్ విభాగాల నుంచి ప్రధాన ఆలయానికి బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ జీఎల్ఆర్‌వీ చౌదరిని ప్రధాన ఆలయం నుంచి షాపుల అద్దెల వసూలు, హాకర్లు, దేవస్థాన భూముల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ టీఎస్ రామ్‌జీకి లీజులు, దేవస్థాన భూముల పర్యవేక్షణతో పాటు ఫైల్స్ కరస్పాండెన్స్ బాధ్యతలు ఇచ్చారు. జూనియర్ అసిస్టెంట్ బి.నరసయ్యకు రోడ్డు ప్రమాదం కారణంగా సెలవుపై ఉంచారు. రికార్డు అసిస్టెంట్ ఎస్. గంగాధర్‌ను టోల్‌గేట్ నుంచి స్కానింగ్ పాయింట్‌కు, ఏకేడీ శివకుమార్‌కు ప్రసాదాల స్టోర్స్, సత్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అటెండర్ జి.కృష్ణప్పకు ప్రధాన ఆలయం నుంచి స్కానింగ్ పాయింట్‌కు, ఎన్ఎంఆర్ ఎం. నరేంద్రను స్కానింగ్ పాయింట్ నుంచి ప్రధాన ఆలయానికి బదిలీ చేశారు.

విద్యాదానం ఎంతో గొప్పది

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): విద్యాదానం ఎంతో గొప్పదని సర్పంచ్ గూడపాటి లావణ్య అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థి నలజాల సుమానయ్య కుమారుడు నరేష్ సుమారు రూ.35 వేల విలువ చేసే బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, పెన్నులు తదితర సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, హెచ్ఎం షేక్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ రూపుమాపడానికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గుణదల (విజయవాడ తూర్పు): బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ మెంబర్ వై.భార్గవ్ రామ్ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాల పీజీ సెమినార్ హాల్లో సోమవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చిన్న పిల్లలతో వెట్టి చాకిరీ చేయించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించడం భవిష్యత్‌కు గొడ్డలి పెట్టని అభిప్రాయపడ్డారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక పేద కుటుంబాలకు చెందిన చిన్నారులే బాల కార్మికులుగా మారుతున్నారని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ – నిర్మూలన అనే అంశంపై ప్రసంగించారు. ఆంధ్ర లయోల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ జి.కిరణ్, నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట

పెనమలూరు: యనమలకుదురు గ్రామం సంజీవయ్యనగర్‌లో సోమవారం విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలో సీతారామాలయంలో శ్రీ లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ సీతారామస్వామివార్ల శిలా విగ్రహాలను ప్రతిష్ఠించటానికి గత నాలుగు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 7.28 గంటలకు ఆలయ అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, శాంతికల్యాణం జరిపించారు. ఆడపడుచులకు నూతన వస్త్రాలు బహూకరించారు. భక్తులు దాదాపు 5 వేల మందికి అన్న సమారాధనం చేశారు.



ఆలయంలో ప్రతిష్ఠించిన స్వామివార్ల విగ్రహాలు

- **కాచవరం(ఇబ్రహీంపట్నం):** కాచవరంలో నూతన కోదండ రామాలయం, విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారామచంద్ర స్వామి, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ విశిష్ట పూజలతో జరిపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కోదండ రామాలయం ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. అర్చక బృందం సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద ఆశీస్సులు అందజేశారు. ఆలయ నిర్మాణ దాత బోడేపూడి అప్పారావు, గ్రామ సర్పంచ్ రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ రంగస్వామి, పాలడుగు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.
- **హనుమాన్‌జంక్షన్‌రూరల్:** బాపులపాడు మండలం పెరికీడులోని పంచాయతన క్షేత్రమైన ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆగమశాస్త్ర ప్రకారం నూతన ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ చేపట్టేందుకు బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య, యలమంచిలి ప్రసాదశర్మ, కుందుర్తి సీతారామయ్య సారథ్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణలతో ఉదయం 7.29 గంటలకు ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. క్రేన్ సాయంతో ఏకశిల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతర శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 5 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, కానుమోలు పీఏసీఎస్ చైర్మన్ చిన్నాల సత్యగణేష్ బాబు, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ బొడ్డేపల్లి నరేష్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహామూర్తి పాల్గొన్నారు.

లైఫ్ స్కిల్స్ కళాశాల ఏర్పాటుతో యువతకు ఉపాధి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఏర్పాటు తో పారిశ్రామిక వాడగా ఉన్న జగ్గయ్యపేట ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఈనెల 14 వ తేదీన ప్రారంభించనున్న లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్యే ఉదయభాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేట పరిసర ప్రాంత పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పించే లైఫ్ స్కిల్స్ ఇంటర్మీడియెట్ వృత్తి విద్య కళాశాలను జగ్గయ్యపేటలో ఏర్పాటుచేయడం ఈ ప్రాంత విద్యార్థులకు సువర్ణ అవకాశమన్నారు.